క్లుప్తంగా

అండర్-17 కబడ్డీ పోటీల్లో ప్రతిభ



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకట్రామిరెడ్డి

మంథని: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 కబడ్డీ పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంథనిలోని సాంఘిక సంక్షేమ బాలురు గురుకుల విద్యాలయంలో బుధవారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో మంథని జోన్ ప్రథమ, సుల్తానాబాద్ జోన్ ద్వితీయ, బాలికల విభాగంలో మంథని ప్రథమ, రామగుండం జోన్ ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్రామిరెడ్డి, పెద్దపెల్లి జిల్లా డీవైఎస్‌వో సురేశ్, పెద్దపెల్లి జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ శ్రీనివాస్, జిల్లా పేట సెక్రటరీ సురేందర్, పేట రాష్ట్ర బాధ్యులు శోభ, స్థానిక కళాశాల పీడీ ప్రసాద్, పీఈటీ కార్తీక్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



బియ్యం అందజేస్తున్న సంస్థ సభ్యులు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద వడాల కిష్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా నేనున్నా స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున పల్లె సురేశ్ 50 కిలోల బియ్యం బాధిత కుటుంబానికి అందజేశారు. సంస్థ సభ్యులు శ్రీనివాస్, అల్లాడి శేఖర్, కంకణాల వెంకటేశ్, అమ్ముల రాములు, బొజ్జ పెద్దులు, గడ్డమీది నరేశ్, లక్ష్మన్ ఉన్నారు.

బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా ప్రభాకర్



సన్మానిస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్: బీసీసెల్ పట్టణ అధ్యక్షుడిగా 8వ వార్డుకు చెందిన టీకే ప్రభాకర్‌ను బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహేశ్ పెండ్యాల నియమించారు. కాగా పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు బుధవారం ప్రభాకర్‌ను సన్మానించారు. 6వ వార్డు కౌన్సిలర్ ఊట్ల వరప్రదీప్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కమిటీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మతీన్, అప్పల తిర్మల, నలవెల్లి రాజమౌళి, న్యాతరి దేవేందర్, కోట శ్రీనివాస్, హేమస్ రాజ్, న్యాతరి శంకర్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పాలకుర్తి: పాలకుర్తి మండలం జీడీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని యూనివర్సల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఇస్మాయిల్ తెలిపారు. ఇటీవల జరిగిన సబ్ జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో అల్మాజ్, మణికంఠ ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

కోరం లేక మండల సభ వాయిదా

ఎలిగేడు: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ తానిపర్తి స్రవంతి అధ్యక్షతన జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరంలేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసమూర్తి తెలిపారు. సమావేశానికి ఎంపీపీ స్రవంతి, వైస్ ఎంపీపీ బుర్ర వీరస్వామిగౌడ్ మాత్రమే హాజరయ్యారు. కోరం లేనందున వాయిదా వేసినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

108 పూలతో పూజ



సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో శివుడికి 108 అంది, లిల్లీ పూలతో వ్యాపారులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బుధవారం రుద్రాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పూజారులు రమేశ్, మహేశ్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శివాలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్‌షెల్టర్లు

- స్టాప్ ఒకచోట.. షెల్టర్లు మరోచోట
- ఎండలో నిలబడుతున్న ప్రయాణికులు
- సర్వీసురోడ్డు లేకపోవడం కూడా ఓ కారణం



ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ వద్ద ఉన్న బస్‌షెల్టర్

జ్యోతినగర్: ప్రజల అవసరాలు, ప్రయాణికుల సౌలభ్యం కోసం ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లో రూ.లక్షల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన బస్‌షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. దీంతో కొందరు హోటళ్లు నడుపుకుంటున్నారు. మరికొన్ని బాటసారులకు మూత్రశాలలుగా మారాయి. ప్రయాణికుల ఆదరణకు నోచుకోక బస్‌షెల్టర్లు నిరుపయోగంగా మారాయి.

రామగుండం కార్పొరేషన్‌లోని ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్, ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్, మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న బస్‌షెల్టర్లు ఏ ఒక్కరికీ ఉపయోగపడేలా నిర్మించలేదు. దీంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణం అభివృద్ధి చెందుతున్న క్రమంలో రాజీవ్ రహదారికి పూర్తిస్థాయి సర్వీసు రోడ్డు నిర్మాణం కాకపోవడం కూడా బస్‌షెల్టర్లు నిరుపయోగంగా ఉండడానికి కారణంగా చెప్పొచ్చు. ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో ఇరువైపులా రాజీవ్ రహదారి రోడ్డు నిర్మించిన వారు రెండు బస్‌షెల్టర్లు నిర్మించారు. కార్పొరేషన్ వారు సైతం దాని పక్కన మరో బస్‌షెల్టర్ నిర్మించారు. అలాగే ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ వద్ద రెండు విభాగాలకు చెందిన బస్‌షెల్టర్లు ఉన్నప్పటికీ ఏ ఒక్కటీ ప్రయాణికులకు ఉపయోగకరంగా లేవు. చాలా ఏళ్లుగా బస్‌షెల్టర్లు ఉత్సవ విగ్రహాలుగా ప్రజలకు దర్శనమిస్తున్నాయి.

బస్టాప్ ఒకచోట.. బస్‌షెల్టర్ మరోచోట

ముఖ్యమైన కూడళ్ల వద్ద బస్‌షెల్టర్లు నిర్మించకపోవడంతో బస్ ఒకచోట ఆగడం.. బస్‌షెల్టర్ మరోచోట ఉండటంతో ప్రయాణికులకు అవి ఉపయోగపడడం లేదు. ఖాళీగా ఉన్న బస్‌షెల్టర్ల ముందు కొందరు వ్యాపారాలు చేసుకొంటున్నారు. బస్‌షెల్టర్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ వద్ద గోదావరిఖని వైపు వెళ్లే బస్సులు నిలపాలి. కానీ అక్కడే ఉన్న సిగ్నల్స్‌తో చాలా బస్సులు సిగ్నల్ దాటిన తర్వాత నిలపడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

సర్వీసు రోడ్డు లేకపోవడంతో సమస్య..

రాజీవ్ రహదారికి బి-పవర్ హౌజ్ నుండి ఆర్టీసీ బస్‌స్టాండు వరకు పూర్తిస్థాయి సర్వీసు రోడ్డు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బస్ షెల్టర్ వద్ద ఉన్న రాజీవ్ రహదారి రోడ్డును కొంతమేర తొలగించి బస్‌లను బస్‌షెల్టర్ల వద్ద నిలిపేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వీసురోడ్డు లేకపోవడంతో..



బి పవర్‌హౌజ్ నుంచి పూర్తిస్థాయిలో సర్వీసు రోడ్డు లేకపోవడంతో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజల సమస్యలను పట్టించుకుని వెంటనే రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలి. ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ సుందరీకరణ పనులు వెంటనే చేపట్టాలి.

– కొలిపాక సుజాత, కార్పొరేటర్, రామగుండం

ఉపయోగంలోకి తీసుకురావాలి



ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్, మేడిపల్లి సెంటర్‌లో ఉన్న బస్‌షెల్టర్లను ఉపయోగంలోకి తీసుకురావాలి. షెల్టర్ల వద్ద బస్సులు నిలపకపోవడంతో ప్రయాణికులు ఎండలో నిలబడుతున్నారు. సిగ్నల్స్ పడిన సమయంలో ఎవరు ఎటువెళ్లాలో తెలియడం లేదు. బస్‌షెల్టర్ ఎదుట ఉన్న రోడ్డును కొంతమేర తొలగించి బస్సులు నిలపాలి.

– రాజ్‌కుమార్, జంగాలపల్లి

నిధులు మంజూరైనా నిర్లక్ష్యం

- నత్తనడకన మిషన్ భగీరథ పైప్‌లైన్ షిఫ్టింగ్ పనులు
- 45రోజులుగా నీటికోసం ఎదురుచూస్తున్న మండల ప్రజలు
- పట్టించుకోని అధికారులు



కొనసాగుతున్న పైప్‌లైన్ నిర్మాణ పనులు

ధర్మారం: మిషన్ భగీరథ పైప్‌లైన్ షిఫ్టింగ్ పనులు నత్తనడకన సాగడంతో రెండు మండలాల ప్రజలు మంచినీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంలో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోకపోవటంతో మిషన్ భగీరథ నీటి కోసం ధర్మారం, వెల్గటూర్ మండలాల ప్రజలు 45 రోజులుగా ఎదురుచూస్తున్నారు. నిధులు మంజూరైనా నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..

జగిత్యాల జిల్లా ఎండపల్లి, వెల్గటూర్ మండలాల ప్రజలకు సాగునీరు అందించేందుకు ఎస్సారెస్పీ డీ83-బి లింక్‌కాలువ నిర్మాణ పనులు చేస్తుండగా ఎండపల్లి, వెల్గటూర్ మండలాలకు అందించే మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు అడ్డుగా ఉన్నాయి. దీంతో మిషన్ భగీరథ అధికారులు ప్రస్తుతం ఉన్న పైప్‌లైన్‌ను షిఫ్టింగ్ చేసేందుకు ప్రభుత్వం ద్వారా అనుమతి తీసుకుని నిధులు సైతం మంజూరు చేయించారు. పది రోజుల్లోనే షిఫ్టింగ్ పనులు పూర్తిచేయాలన్న డిమాండ్‌తో అధికారులు పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయితే సదరు కాంట్రాక్టర్ కెనాల్ నిర్మాణం పనులు షిఫ్టింగ్ పనులకు అడ్డంగా మారాయని సాకు చూపిస్తూ 45 రోజులుగా పనులను నత్తనడకన కొనసాగిస్తున్నారు. సెప్టెంబర్ 22న అధికారులు మిషన్ భగీరథ నీటి సరఫరాను నిలిపివేసి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయితే పదిరోజుల్లో పూర్తిచేయాలన్న అధికారుల ఆదేశాలు అమలు కాలేదు. ఇప్పటి వరకు కేవలం 600 మీటర్ల పొడవు పైప్‌లైన్ పనులు పూర్తికాగా మరో 200 మీటర్ల పైప్‌లైన్ పనులు చేయాల్సి ఉంది. అంతే కాకుండా ఎస్సారెస్పీ కెనాల్‌పై నుంచి ఎంఎస్ పైప్‌లైన్ వేయాల్సి ఉంది. మరో 20రోజుల వరకు మిషన్ భగీరథ నీరు వెల్గటూర్, ఎండపల్లి, ధర్మారం మండలాల ప్రజలకు అందేలా సరఫరా చేసే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పనుల్లో జాప్యం..

ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు పూర్తిచేయడంలో నిర్లక్ష్యం చేయడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబధిత అధికారులు స్పందించి యుద్ధప్రాదిపదికన పనులు పూర్తి చేయించాలని కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత మిషన్ భగీరథ ఏఈ అజీంను వివరణ కోరగా పైప్‌లైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్న స్థలంలోనే ఎస్సారెస్పీ లింక్ కెనాల్ నిర్మాణం చేస్తున్న సమయంలో వచ్చిన రాక్ బోల్డర్‌ను సదరు కాంట్రాక్టర్ వేశారు. ఈ రాక్‌బోల్డర్‌ను తొలగించటంలో జాప్యం జరిగింది. దీంతో పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందని ఏఈ వివరించారు.

ఇబ్బంది పడుతున్నాం



గత 45 రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదు. దీంతో దూరంగా ఉన్న బోరింగ్ వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం. దూరం నుంచి నీరు తీసుకురావడానికి ఎక్కువ సమయం పడుతోంది. దీంతో కూలీ పనులకు వెళ్లలేకపోతున్నాం. వెంటనే మంచినీరు సరఫరా చేయాలి.

– భూక్య బుజ్జి, బంజేరుపల్లి తండా

మంచినీరు సరఫరా చేయాలి



చాలారోజుల నుంచి మిషన్ భగీరథ నీరు తాగుతున్నాం. ఇప్పుడు భగీరథ నీరు రాకపోవడంతో వేరే నీరు తాగలేకపోతున్నాం. నీటి సరఫరా నిలిపివేయడంతో చాలా ఇబ్బంది కలుగుతోంది. చాలారోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. వెంటనే మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలి.

– స్రవంతి, ధర్మారం



సులభ్ కాంప్లెక్స్ మూసివేస్తే ఎలా!

జ్యోతినగర్: అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉండాల్సిన సులభ్ కాంప్లెక్స్ మూతపడటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లో ప్రయాణికుల కోసం నిర్మించిన సులభ్ కాంప్లెక్స్ కొన్ని నెలలు మాత్రమే ప్రజలకు ఉపయోగపడింది. చాలా నెలలుగా మూసి వేసి ఉంది. ఎన్టీపీసీ, ఎఫ్‌సీఐతో పాటు పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇతర ప్రాంతాలకు బస్సుల్లో ఇక్కడి నుంచి వెళతారు. అత్యవసరంగా ఉపయోగించుకునేందుకు సులభ్ కాంప్లెక్స్ లేకపోవడంతో వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సులభ్ కాంప్లెక్స్‌ను వినయోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్



ముత్తారం: ముత్తారం మండలం హరిపురం గ్రామానికి చెందిన చెన్నవేన సాయికుమార్ ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తెలిపారు. ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ పటిష్టతకు కృషి చేస్తానని సాయికుమార్ పేర్కొన్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



శిథిలావస్థకు చేరిన ఎంపీడీవో క్వార్టర్లు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ఎంపీడీవో కార్యాలయం పరిధిలో ఉన్న ఎంపీడీవో క్వార్టర్లు శిథిలావస్థలోకి చేరాయి. పలు క్వార్టర్లు ఖాళీగా ఉండడంతో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. ఒకటి శిథిలావస్థలోకి చేరింది. స్వల్ప మరమ్మతు చేస్తే ఉపయోగంలోకి వస్తాయని పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు అంటున్నారు. క్వార్టర్లను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ప్లాస్టిక్ రహిత దీపావళి జరుపుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు



మట్టి ప్రమిదలతో మెప్మా సిబ్బంది

కోల్‌సిటీ: రామగుండంలో ప్లాస్టిక్ రహితంగా, పొల్యూషన్ లేకుండా దీపావళి వేడుకలు జరుపుకోవాలని రామగుండం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు సూచించారు. 'స్వచ్ఛ దివాళి–శుభ దివాళి' ప్రచార కార్యక్రమంలో భాగంగా గోదావరిఖనిలోని గాంధీనగర్‌లో బుధవారం నగరపాలక సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి ప్రమిదల్లోనే దీపాలను వెలిగించాలన్నారు. దీపాలను పోలి ఉండే ప్లాస్టిక్ ప్రమిదలు ఉపయోగించవద్దని, కాలుష్య కారకమైన టపాసులను కాల్చొద్దన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం క్లీన్, గ్రీన్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఫ్రీ దివాళి జరుపుకునేలా అందరినీ ప్రోత్సహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, జూనియర్ అసిస్టెంట్ శంకర్‌రావు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, మెప్మా సీవోలు శ్వేత, ఊర్మిళ, ప్రియదర్శిని, స్వప్న, ఆర్పీలు పాల్గొన్నారు.

బల్దియాలో విజిలెన్స్ అధికారుల విచారణ



వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

- బిల్లులు చెల్లించిన రెండేళ్లకు వాహనాల కొనుగోలు
- నేరుగా వాహనాలను తనిఖీ చేసిన అధికారులు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో రెండేళ్ల క్రితం పారిశుద్ధ్య విభాగానికి అవసరమైన వాహనాల కొనుగోలు అక్రమాలతోపాటు పలు ఫిర్యాదులపై బుధవారం మరోసారి విజిలెన్స్ విభాగం అధికారులు బల్దియా కార్యాలయంలో విచారణ జరిపారు. రెండేళ్ల క్రితం పారిశుద్ధ్య విభాగానికి పలు వాహనాలు కొనుగోలు చేయడానికి, 14వ ఆర్థిక సంఘం ద్వారా సుమారు రూ.7కోట్ల నిధులతో టీఎస్ ఆగ్రోస్ ద్వారా ఓ ఏజెన్సీకి టెండర్ అప్పగించారు. సదరు ఏజెన్సీ కొన్ని వాహనాలను మాత్రమే సరఫరా చేసి, సదరు ఏజెన్సీ రూ.2.34 కోట్ల వ్యయం చేసే ఐదు వాహనాలతోపాటు 50 గార్బేజ్ బిన్స్‌ను సరఫరా చేయలేదు. బల్దియా డబ్బులు చెల్లించినప్పటికీ రెండేళ్లుగా వాహనాలను సరఫరా చేయకపోవడం, ఇందులో బల్దియా అధికారుల హస్తం ఉందనే అనుమానాలతో పలువురు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన విజిలెన్స్ విభాగం దర్యాప్తు చేపట్టడంతో ఇటీవల వరుసగా ఐదు వాహనాలను సదరు ఏజెన్సీ సంస్థ ఎట్టకేలకు బల్దియాకు చేరవేసింది. ఇంకా 50 గార్బేజ్ బిన్స్ రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బుధవారం ఆర్టీవో అధికారులతో కలిసి విజిలెన్స్ విభాగం అధికారులు బల్దియా కార్యాలయంలో మరోసారి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. ఇటీవల బల్దియాకు చేరిన కొత్త వాహనాల వివరాలు, వాటి ఇంజన్ నంబర్లు, రిజిస్ట్రేషన్ నంబర్లు, వారంటీ బుక్స్, ఇన్‌వాయిస్, కంపెనీ బిల్స్‌తోపాటు రెండేళ్ల క్రితం ఈ వాహనాల కొనుగోలుకు వర్క్ ఆర్డర్‌లో పొందుపరిచిన బిల్లులు, మోడల్ నంబర్లను తనిఖీ చేశారు. అలాగే పలు డివిజన్లలో వేసిన సీసీరోడ్ల నిర్మాణానికి చెందిన శాంపిళ్లను కూడా సేకరించినట్లు తెలిసింది.

'చలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ సారథ్యంలో ఈ నెల 11న ఎస్సీ వర్గీకరణ కోసం హైదరాబాద్‌లో చేపట్టిన మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మున్సిపల్ అధ్యక్షుడు ముల్కల శ్రావణ్ కోరారు. ఆయన ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవికుమార్, నాయకులు మంథని చందు, ఈదునూరి కొమురయ్య, గద్దల శశిభూషణ్, కాంపెల్లి శ్రీనివాస్, సీపీఐ చంద్రశేఖర్, కన్నం లక్ష్మణ్, ఓదెన్న, రామచంద్రం పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

ఎలిగేడు: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం నవంబర్ 11న చేపట్టనున్న విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కాంపెల్లి రాజేశం కోరారు. ఎలిగేడు మండల కేంద్రంలో బుధవారం విశ్వరూప మహాసభ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభకు పీఎం మోడీ హాజరవుతున్నందున మండలంలోని అన్ని గ్రామాల నుంచి మాదిగ ఉపకులాలు తరలిరావాలని పిలుపునిచ్చారు. దివ్యాంగుల జాతీయ అధ్యక్షుడు ఎల్.గోపాల్, ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ అంబాల రాజేందర్, న్యాతరి శంకరయ్య, మొలగూరి సదానందం, కనకం రమేశ్, శ్రీనివాస్, బాపయ్య, రమేశ్, శంకర్, నారాయణ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నిర్వహణ కమిటీ

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని పాండవుల గుట్టపై 597 సర్వే నంబర్‌లో రెండెరాల స్థలంలో అయ్యప్ప ఆలయ నిర్మాణం కోసం బుధవారం భూమిపూజ చేశారు. త్వరలో ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆలయ నిర్మాణ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. అయ్యప్ప భక్తులు, ధార్మికులు ఆలయ నిర్మాణానికి శక్తికొలది విరాళాలు అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పెద్దరాతుపల్లి సర్పంచ్ ఓరుగంటి కొమురయ్యగౌడ్, తొట్ల రవియాదవ్, అల్లం దేవేందర్‌యాదవ్, ప్రసాద్ గుప్త, బైరి కుమార్, వీరారెడ్డి, సంజీవ రెడ్డి, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఇబ్రహీం



నియామక పత్రం అందజేస్తున్న శ్రీధర్‌బాబు

పాలకుర్తి: కాంగ్రెస్ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాలకుర్తి మండలం కన్నాల పంచాయతీ పరిధిలోని రజీవ్‌కాలనీకి చెందిన మహ్మద్ ఇబ్రహీం నియామకమయ్యారు. కాగా బుధవారం మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇబ్రహీంకు నియామకపత్రం అందజేశారు.